# ప్రశ్నలకు భయమేనా..?









శుక్రవారం 31 జూలై 2026

పేజీలు : 8


### పాఠశాలలపై మండల విద్యాధికారి
# పర్యవేక్షణ ఎక్కడ?




**కొండాపూర్ ప్రజా జ్యోతి** మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల లో నామమాత్రంగా పర్యవేక్షణలో మండల విద్యాధికారి (ఎంఈఓ) నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలలకే ప్రాధాన్యం ఇస్తూ, వాటితో కుమ్మక్కయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల పనితీరును క్రమం తప్పకుండా పరిశీలించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కనిపించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.అదే సమయంలో మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగినట్లు చెబుతున్న దొంగతనాల ఘటనలపై ఇప్పటి వరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.పాఠశాలల్లో చోటుచేసుకుంటున్న సమస్యలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని, గురుకుల పాఠశాలలో జరిగిన ఘటనపై పారదర్శక విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రైవేటు పాఠశాలలతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు ..**

**గురుకుల పాఠశాలలో దొంగతనాలపై చర్యలు ఎక్కడ?**

### ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు
# జన్మదినం సందర్భంగా అన్నదానం


**డాకూర్‌లో 100 మంది పేదలకు భోజన వితరణ..**

**సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలు**



**అందోల్, జూలై 30 (ప్రజాజ్యోతి):**

లయన్స్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ జి. బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకుని జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు జి.ఆర్. మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో అందోల్ మండలంలోని డాకూర్ గ్రామంలో సుమారు 100 మంది నిరుపేదలకు అన్నదానం చేపట్టి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పీఆర్ఓ డాక్టర్ కే. అనంతరెడ్డి మాట్లాడుతూ.. లయన్ జి. బాబురావు లయన్స్ ఉద్యమంలో విశిష్ట సేవలు అందించిన నాయకుడని కొనియాడారు. డిస్ట్రిక్ట్ 320డీ గవర్నర్‌గా, మల్టిపుల్ డిస్ట్రిక్ట్ 320 గవర్నర్‌గా, ప్రస్తుతం లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా సేవలందిస్తూ సమాజ సేవలో ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. పేదలు, నిరుపేదల సంక్షేమం కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వేలాది మందికి అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. జన్మదినాన్ని ఆర్భాటాలకు దూరంగా సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం అభినందనీయమని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో కోశాధికారి జి. సంతోష్, సభ్యులు మధుసూదన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. లబ్ధిదారులు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.




# నాలాల కబ్జా.. అక్రమ వాగుల ముప్పు..

**రైతుల ప్రాణాలతో చెలగాటమా?**

**ప్రమాదం ముందే తెలిసినా పట్టించుకోని అధికారులు**

**సాగుభూములకు గండి, రైతుల్లో ఆందోళన**

# ప్రశ్నలకు భయమేనా..?

## మెదక్ మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి మీడియాకు నో ఎంట్రీ

**మెదక్ (ప్రజా జ్యోతి )జూలై 30** మెదక్ మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను అనుమతించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వర్షాకాలం నేపథ్యంలో పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటిపై టీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, ఎలాంటి పనులు చేపట్టడం లేదని అధికారులు ఇబ్బందికర ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే మీడియాను సమావేశానికి దూరంగా ఉంచారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా డబుల్ బెడ్రూమ్ కాలనీల వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని, ఇటీవల ఓ బాలికపై జరిగిన దాడి ఘటనపై కూడా ప్రశ్నలు వెల్లువెత్తే అవకాశం ఉండటంతో సమావేశానికి మీడియాను అనుమతించలేదనే చర్చ సాగుతోంది. ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై జరిగే సర్వసభ్య సమావేశాన్ని మీడియాకు మూసివేయడం పారదర్శకతపై సందేహాలు రేకెత్తిస్తోంది.




ప్రజల సమస్యలపై చర్చ జరిగే వేదికకు మీడియాను దూరంగా ఉంచడం వెనుక అసలు కారణాలేమిటన్న ప్రశ్నకు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే, మీడియాను అనుమతించకపోవడానికి గల కారణాలపై మున్సిపల్ యంత్రాంగం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక వివరణ వెలువడలేదు.

# అదనపు తరగతి గదులకు రూ.44 లక్షలు మంజూరు





**-విద్యార్థినులకు యూనిఫాంలు, బ్లాంకెట్లు, బెడ్షీట్లు పంపిణీ**

**-ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**




**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 30:** కంగ్టి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం కేజీబీవీ అభివృద్ధికి నాబార్డ్ నిధుల కింద రూ.44 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి గురువారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులకు యూనిఫాంలు, బ్లాంకెట్లు, బెడ్షీట్లు పంపిణీ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలతో చదువుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు తరగతి గదుల నిర్మాణంతో విద్యార్థినులకు మరింత అనుకూలమైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాంలు, బ్లాంకెట్లు, బెడ్షీట్లు వంటి సంక్షేమ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కంగ్టి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సర్దార్ నాయక్, వినోద్ పాటిల్, మాజీ ఎంపీటీసీ పండరి రెడ్డి, కృష్ణ ముదిరాజ్, బాబు, సర్పంచులు, శ్రీనివాస్ రెడ్డి, లోండే నర్సింలు కురుమ, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముసురు పట్టిన మెదక్..!

**మూడు రోజులుగా ఎడతెరిపి లేని జల్లులు**



**మెదక్ (ప్రజా జ్యోతి) జూలై 30:** గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జల్లులతో మెదక్ నగరం పూర్తిగా ముసురుపట్టింది. నల్లని మేఘాలు నగరాన్ని కమ్మేయగా, ఉదయం నుంచి రాత్రి వరకు చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో నగరం తడిసి ముద్దవగా, రహదారులు ఎప్పటికప్పుడు తడిగా మారి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరంతర వర్షాల ప్రభావంతో ప్రజల రాకపోకలు మందగించాయి. వ్యాపార కార్యకలాపాలపై కూడా ప్రభావం పడగా, చిరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, వర్షాల కారణంగా వాతావరణం ఆహ్లాదకరంగా మారినప్పటికీ, ముసురు కొనసాగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఈ వాతావరణాన్ని రైతులు మాత్రం సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు... వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రానున్న రోజుల్లో కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ అయ్యాయి.

## సిర్గాపూర్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్కోట్లు పంపిణీ



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 30:** వర్షాకాలంలో పారిశుద్ధ్య కార్మికుల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సిర్గాపూర్ మండల కేంద్ర గ్రామ పంచాయతీలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోల చంద్రశేఖర్ రెడ్డి పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యంగా వర్షాకాలంలో విధులు నిర్వహించే సమయంలో వారికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రెయిన్కోట్లను అందజేసినట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, వారి సంక్షేమానికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిర్గాపూర్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రావ్ పాటిల్, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలమడుగు గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో ఎల్ నినో, భూసార పరీక్షలపై రైతులకు అవగాహన సదస్సు




**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 30:** వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో నిజాంపేట్ మండలం ర్యాలమడుగు గ్రామంలో రైతుల కోసం ఆర్పీఎల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు నారాయణఖేడ్ సహాయ వ్యవసాయ అధికారి నూతన్ కుమార్ అన్నారు. గురువారం భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, అనువైన వంగడాల ఎంపిక, సస్యరక్షణ చర్యలు, ఎల్ నినో వాతావరణ ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే రసాయన ఎరువులను వినియోగించాలని సూచించారు. అవసరానికి మించి ఎరువులు వాడడం వల్ల భూమి సారం తగ్గిపోవడంతో పాటు రైతులకు అదనపు ఖర్చు భారం పడుతుందని వివరించారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ.. ఎల్ నినో వాతావరణ పరిస్థితుల వల్ల పంటలపై కలిగే ప్రభావాలను వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నూతన వంగడాలను ఎంపిక చేసుకోవడం, సస్యరక్షణ చర్యలు చేపట్టడం, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతులు మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాయిలు, ఏఈఓ నికిత, బీటీఎం మారుతి రెడ్డి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ రీజియన్ లయన్స్ నాయకులకు ఎమ్మెల్యే సన్మానం



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 30:** లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320డీ మెదక్ రీజియన్ నూతన పదవీ బాధ్యతలు చేపట్టిన రీజియన్ చైర్మన్ బి. రాజ్‌కుమార్, రీజియన్ సెక్రటరీ చంద్రశేఖర్ ఆచార్య, జోన్ చైర్మన్ డి. వెంకట్రావులను నారాయణఖేడ్ లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ.. మెదక్ రీజియన్ పరిధిలోని 15 లయన్స్ క్లబ్‌ల బాధ్యతలను రీజియన్ చైర్మన్‌గా బి. రాజ్‌కుమార్ స్వీకరించడం అభినందనీయమని అన్నారు. రీజియన్‌లోని అన్ని లయన్స్ క్లబ్‌లను సమన్వయం చేసుకుంటూ సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, రక్తదాన శిబిరాలు వంటి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. లయన్స్ క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణఖేడ్ అధ్యక్షులు బి. సాయి సంగమేశ్వర్, క్లబ్ సభ్యులు రవికుమార్, శామ్యూల్, యూసుఫ్, ముదస్సిర్, బసవ చేతన్ తదితరులు పాల్గొన్నారు.

## నాలాల కబ్జా.. అక్రమ వాగుల ముప్పు..

**కొండాపూర్ ప్రజా జ్యోతి :** మన్సాన్పల్లి, మల్లేపల్లి ముని దేవునిపల్లి, గంగారం, మల్కాపూర్, మాందాపూర్ తదితర గ్రామాల్లో సాగునీటి నాలాలు, వాగులపై అక్రమ కబ్జాలు, నిర్మాణాలు పెరుగుతున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వాగులు ఉప్పొంగి పొలాలు దెబ్బతింటాయని, నాలాలపై ఆక్రమణల వల్ల నీటి ప్రవాహం ఆగిపోయి పంటలు నష్టపోతాయని ముందుగానే తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. రియాక్టర్ నాలాలు, సాగునీటి కాలువలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో వర్షపు నీరు సహజంగా వెళ్లే మార్గాలు మూసుకుపోతున్నాయని రైతులు చెబుతున్నారు. ఫలితంగా వర్షం కురిసిన ప్రతిసారి నీరు పొలాల్లోకి చేరి పంటలు మునిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రతి ఏడాది ఇదే సమస్య పునరావృతమవుతున్నా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టకపోవడం, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకపోవడం వల్ల పరిస్థితి మరింత దిగజారుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం సంభవించిన తర్వాత స్పందించడం కంటే ముందస్తుగా వాగులు, నాలాలను ఆక్రమణల నుంచి విముక్తం చేసి నీటి ప్రవాహాన్ని సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.వర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు చేస్తున్నప్పటికీ, వరదలకు ప్రధాన కారణమవుతున్న నాలాల కబ్జాలు, అక్రమ నిర్మాణాలపై మాత్రం చర్యలు తీసుకోకపోవడం పట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించి రైతుల పంటలను కాపాడాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## క్షేత్రస్థాయిలో గ్రామాల పరిశీలనతో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తహసీల్దార్ అశోక్..



**కొండాపూర్ ప్రజా జ్యోతి** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కొండాపూర్ తహసీల్దార్ అశోక్ ప్రతిరోజూ మండలంలోని గ్రామాలను క్షేత్రస్థాయిలో సందర్శించి పనులను పర్యవేక్షించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియతో పాటు బీఎల్‌వోలు, సూపర్‌వైజర్ల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి గ్రామంలో పురోగతిని స్వయంగా పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన నిరంతర పర్యవేక్షణ, సమర్థవంతమైన ప్రణాళికతో మండలంలో ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యిందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్ మాట్లాడుతూ, ప్రజల సహకారం, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, రెవెన్యూ సిబ్బంది సమిష్టి కృషి వల్లే కార్యక్రమం విజయవంతమైందని, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## గంజాయిపై అవగాహన కల్పిస్తూ కరస్‌గుత్తిలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు చేస్తూ గ్రామస్తులకు అవగాహన

**నాగల్గిద్ద జులై 30 ప్రజాజ్యోతి :** నారాయణఖేడ్ నియోజకవర్గం



నాగల్‌గిద్ద మండలంలోని కారస్‌గుత్తి గ్రామంలో గంజాయి సాగు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంపై సంగారెడ్డి డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ విశ్వనాథ్, నాగల్‌గిద్ద ఎస్ఐ కాశీపురం రామకృష్ణ పోలీసు సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గ్రామస్తులకు గంజాయి వంటి మాదకద్రవ్యాలు వాడటం వల్ల అనర్థాలకు గురి కాకుండా ఉండాలని ప్రతి ఒక్కరు మేలుకొని ఉండాలని గంజాయి సాగు, రవాణా, విక్రయం లేదా వినియోగాన్ని చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించారు. వాటి వల్ల అందరి భవిష్యత్తు నాశనం కాకుండా ఉండాలని గ్రామంలో ఎవరైనా గంజాయి సాగు చేస్తున్నట్లు ఏర్పడితే మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించగలమని పోలీసులు తెలిపారు.

## వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-- నారాయణఖేడ్ మున్సిపల్ కౌన్సిలర్ విజయ్ బుజ్జి



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 30:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నారాయణఖేడ్ మున్సిపల్ కౌన్సిలర్ విజయ్ బుజ్జి సూచించారు. గురువారం వార్డులో మురికికాలువలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాల కారణంగా తడిసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, ఇనుప స్తంభాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకవద్దని, రైతులు పొలాల్లో పని చేసే సమయంలో విద్యుత్ స్తంభాలు, తీగలకు సురక్షిత దూరం పాటించాలని కోరారు. ఇళ్లలో విద్యుత్ పరికరాలను జాగ్రత్తగా ఉపయోగించాలని, ముఖ్యంగా చిన్నారులు మరియు వృద్ధులు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా చూసుకోవాలని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, కాలువలు, చెరువుల వద్దకు వెళ్లకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

అలాగే శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రైనేజీ కాలువలు, వాగులు, వంకల సమీపానికి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## హీనా బేగంకు సన్మానించిన ఎమ్మెల్యే డాక్టర్



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 30:** స్త్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ పాలకవర్గ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాల డైరెక్టర్‌గా ఘన విజయం సాధించిన హీనా బేగంను నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తన నివాసంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక సాధికారతకు స్త్రీనిధి సంస్థ కీలక భూమిక పోషిస్తోందన్నారు. అలాంటి ప్రతిష్టాత్మక సంస్థకు ఉమ్మడి జిల్లా డైరెక్టర్‌గా హీనా బేగం ఎన్నిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తూ, అర్హులైన మహిళలకు రుణాలు సకాలంలో అందేలా ఆమె కృషి చేయాలని ఆకాంక్షించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. హీనా బేగం మాట్లాడుతూ.. తన విజయం కోసం సహకరించిన సంగారెడ్డి, మెదక్ ఉమ్మడి జిల్లాల మహిళా సంఘాల ప్రతినిధులకు, అలాగే తనకు అండగా నిలిచిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మార్గదర్శకత్వంలో మహిళల సంక్షేమం కోసం, స్త్రీనిధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ ఎంపీటీసీ పండరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రహీం, స్థానిక నాయకులు గౌస్ చిస్తీ, వివిధ మండలాల సర్పంచులు తయాబ్, ఔదత్‌పూర్ శాంతప్ప తదితరులు పాల్గొన్నారు.

## ముంబై - హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ కారిడార్ ను జహీరాబాద్ మీదుగా ఏర్పాటు చేయాలి

లి కేంద్ర రైల్వే మంత్రి స్పందనపై ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి హర్షం



**జహీరాబాద్, జూలై 30( ప్రజా జ్యోతి న్యూస్ )** ?ముంబై – హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను జహీరాబాద్ మీదుగా అలైన్ మెంట్ చేయాలని ఎమ్మెల్సీ డా.అంజిరెడ్డి కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ ఈ నెల 11 తేదీన కేంద్ర రైల్వే, సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం అందించిన విషయం విదితమే.ఎమ్మెల్సీ డా. అంజిరెడ్డి అందించిన విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందిస్తూ అధికారికంగా ప్రత్యుత్తరం పంపారు. ముంబై – హైదరాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్‌ను జహీరాబాద్ మీదుగా మార్గం మార్చాలని కోరుతూ పంపిన అభ్యర్థనను పరిశీలన నిమిత్తం స్వీకరించినట్లు, తదుపరి అవసరమైన చర్యలు పరిశీలన అనంతరం తీసుకోబడతాయని కేంద్ర మంత్రి ఇటీవల తన లేఖలో స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి సానుకూల స్పందన పట్ల ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి హర్షం: జహీరాబాద్ ప్రాంత పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి, ప్రయాణి కుల సౌలభ్యానికి ముంబై – హైదరాబాద్ బుల్లెట్ రైలు మార్గం జహీరాబాద్ మీదుగా వెళ్లడం అత్యంత కీలకమని, దీనిపై కేంద్ర మంత్రి స్పందించి పరిశీలనకు ఆదేశించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ జహీరాబాద్ మీదుగా సాకారమైతే ఈ ప్రాంతంలో రవాణా లాజిస్టిక్స్ సౌకర్యాలు అద్భుతంగా మెరుగవడమే కాకుండా, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మరింత బలపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## వర్షాకాలంలో విద్యుత్ భద్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**– ఖేడ్ ఎస్సై రాసుల శ్రీశైలం**



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 30:** వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్ ఎస్సై రాసుల శ్రీశైలం సూచించారు. ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ..ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా విద్యుత్ షాక్‌లు, ఇతర ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన తెలిపారు. తెగిపోయిన లేదా నేలపై పడిన విద్యుత్ తీగలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దగ్గరగా వెళ్లవద్దని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, జంక్షన్ బాక్సుల వద్ద నీరు నిల్వ ఉంటే వాటికి దూరంగా ఉండాలని సూచించారు. తడి చేతులతో విద్యుత్ స్విచ్‌లు, ఎలక్ట్రికల్ పరికరాలను తాకవద్దని, చిన్నారులు విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఇంట్లో విద్యుత్ వైరింగ్, ఎర్తింగ్ సరిగా ఉందో లేదో పరిశీలించి, లోపాలు ఉంటే అర్హత కలిగిన ఎలక్ట్రిషియన్‌తోనే మరమ్మతులు చేయించాలని సూచించారు. చెట్లు విద్యుత్ తీగలపై పడినా లేదా తీగలు వాలి కనిపించినా వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. వర్షం, ఉరుములు, మెరుపుల సమయంలో విద్యుత్ స్తంభాలు లేదా చెట్ల కింద నిలబడవద్దని, ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే నేరుగా తాకకుండా ముందుగా విద్యుత్ సరఫరా నిలిపివేసి సహాయక చర్యలు చేపట్టి వెంటనే 108కు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా వర్షాల సమయంలో వాహనదారులు అధిక వేగంతో ప్రయాణించకుండా నెమ్మదిగా, అప్రమత్తంగా వాహనాలు నడపాలని కోరారు. ప్రజల ప్రాణ భద్రతే మా ప్రాధాన్యం అన్నారు. వర్షాకాలంలో చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీయవచ్చు అని సూచించారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ భద్రతా నియమాలను పాటిస్తూ, పోలీసు మరియు విద్యుత్ శాఖ అధికారులతో సహకరించి ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేశారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సర్పంచ్ రాధ తుకారం

**రాయికోడ్ జూలై 30 (ప్రజా జ్యోతి):** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రాయికోడ్ గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ బలమ్మోళ్ల రాధ తుకారం విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అలాగే విద్యుత్ స్తంభాలు,తెగిపోయిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. చిన్నారులు,వృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని,ఎలాంటి వదంతులను నమ్మకుండా ప్రభుత్వ అధికారులు,విపత్తు నిర్వహణ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సర్పంచ్ రాధ తుకారం సూచించారు. ప్రజలందరూ జాగ్రత్తగా ఉండి సురక్షితంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# ఫార్మేషన్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 30:** నారాయణఖేడ్ మండల పరిధిలోని హంగిర్గ (కె) గ్రామం నుంచి గోప్య నాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని లాల్ సింగ్ తండా వరకు నూతనంగా నిర్మించనున్న ఫార్మేషన్ రోడ్డు పనులకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి, ప్రతి తండాకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. హంగిర్గ (కె) నుంచి లాల్ సింగ్ తండా వరకు సరైన రహదారి లేక ప్రజలు, రైతులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం తండా ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు విద్యార్థులు, రైతులు, అత్యవసర సేవలు సులభంగా చేరుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహాదేవి శాంత్ కుమార్, ఉపసర్పంచ్ భాస్కర్ ముదిరాజ్, మనోహర్ పాటిల్, మాజీ సర్పంచ్ వినోద్ పాటిల్, మాజీ ఎంపీటీసీ పండరి రెడ్డి, రమేష్ చౌహన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ రెడ్డి, రాజు కుమార్ పాటిల్, పుండ్లిక్, నగ్శెట్టి పాటిల్, సంగప్ప బిరాదర్, శ్రీకాంత్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.